
సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 19 । మే । 2023



రైల్వే ట్రాక్ భగ భగ

పైన మండే సూర్యుడు.. కింద నిప్పు కణికల్లాంటి కంకర రాళ్లు.. గడ్డపార, పంజా చేతపట్టి కంకర వేరు చేయాలి.. ఎండకు ఆరోగ్యం సహకరించకపోయినా కుటుంబపోషణకు కష్టపడుతున్నారు ఆ కార్మికులు.

8లో▸



పేస్కేలు ఇప్పించండి

పెద్దపల్లిరూరల్: తమకు పేస్కేల్ వర్తించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని మంత్రి హరీశ్‌రావును కోరినట్టు ఉపాధి హామీ టీఏల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం

41.0/29.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రోజంతా ఎండగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎడ్‌సెట్



పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

కమాన్‌పూర్(మంథని): మంథని జేఎన్టీయూలో గురువారం నిర్వహించిన ఎడ్‌సెట్ ప్రశాంతంగా ముగిసింది. మూడు సెషన్స్‌లో పరీక్ష నిర్వహించారు. మొదటి పరీక్షకు 100 మందికి 67 మంది, రెండో పరీక్షకు 100 మందికి 79 మంది, మూడో పరీక్షకు 76 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఓ విద్యార్థి పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావడంతో అనుమతించలేదని తెలిపారు.

ఎండదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి



ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం బయట తిరగొద్దని, చిన్నపిల్లలు, వృద్ధులు ఇంట్లోనే ఉండాలని సూచించారు. కార్మికులు తమతమ పనిప్రాంతాల్లో నీడ ఉండేలా చూసుకోవడంతోపాటు తరచూ ఓఆర్‌ఎస్ ద్రావణం తాగాలని సూచించారు. శరీరంపై దద్దుర్లు, చర్మం పొడిబారడం వంటివి కనిపించినా, అలసట, నోరు ఎండిపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించినా వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు పొందాలన్నారు.

శాత్రాజ్‌పల్లి రోడ్డు నిర్మాణానికి రూ.3.20 కోట్లు



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మంథని: ముత్తారం మండలం పారుపల్లి గ్రామపంచాయతీ పరిధి శాత్రాజ్‌పల్లి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.20కోట్లు మంజూరయ్యాయి. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కృషితోనే నిధులు మంజూరయ్యాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతనెల శాత్రాజ్‌పల్లిని సందర్శించిన పుట్టమధుకు గ్రామస్తులు సమస్యను విన్నవించారని, దీంతో ఆయన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌కు వినతిపత్రం అందించగా.. నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పారుపల్లి మాజీ సర్పంచ్ వొడ్నాల రాజు, నాయకులు నీరటి రవి, నీలం అంజిబాబు, తదితరులు ఉన్నారు.

22 నుంచి సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

పెద్దపల్లిరూరల్: సీఎం కప్ క్రీడల్లో భాగంగా ఈనెల 22నుంచి 24వరకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే మండలస్థాయి పోటీలు పూర్తిచేశామని, ఆ పోటీల్లో 865 మంది క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. జిల్లాస్థాయిలో స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 21లోగా తమ పేర్లను డీపీఆర్‌ఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, సెల్ నంబరు 9550466840లో సంప్రదించాలని సూచించారు.

రేపట్నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్ ఫెయిలైన 381 మంది విద్యార్థులకు ఈనెల 20 నుంచి జూన్ 10 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో మాధవి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెసిడెన్షియల్ సౌకర్యాలతో బాలురకు రామగుండంలోని బాలుర మైనార్టీ రెసిడెన్షియల్‌లో, బాలికల కోసం కుందనపల్లిలోని కేజీబీవీలో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

‘తరుగు’పై గరంగరం

మట్టి మాఫియాపై సభ్యుల ఆగ్రహం

- పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉంటలేరు..
- ఇంటింటికీ తాగునీరు అందటం లేదు..
- జెడ్పీ సమావేశంలో సమస్యలు ఏకరువు పెట్టిన సభ్యులు



జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సభ్యులు

సాక్షి, పెద్దపల్లి: రెండున్నర గంటల్లో ఆరు శాఖలపై చర్చించిన సభ్యులు పౌరసరఫరాలు, భూగర్భగనుల శాఖల పనితీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యంగా జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో రైతన్నలు పడుతున్న ఇబ్బందులు, తేమతాలు పేరుతో మిల్లర్లు కటింగ్‌పై, రాఘవపూర్, కొత్తపల్లి గ్రామాల్లో జోరుగా సాగుతున్న మట్టిదందాపై నిలదీశారు. గురువారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అధ్యక్షతన నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ సంగీత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సభ్యులు లేవనెత్తిన అంశాలు..

→ వ్యవసాయం, మిషన్ భగీరథ, వైద్యం, ఆరోగ్య, పౌరసరఫరాలు, విద్యా, భూగర్భ గనుల శాఖల పనితీరు మీద అధికారులు ప్రగతినివేదిక చదివి వినిపించారు. సభ్యులు క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు.

→ మంథని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఇప్పటివరకు ఒక్కసారి కూడా నిర్వహించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని మంథని జెడ్పీటీసీ సుమలత ఆరోపించారు.

→ గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ సరిగా లేక కంపుకొడుతున్నాయని, రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, పీహెచ్‌సీలల్లో వైద్యులు సమయపాలన పాటించటం లేదని పాలకుర్తి జెడ్పీటీసీ సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

→ సుల్తానాబాద్ ఆసుపత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ ఎంపీపీ డిమాండ్ చేశారు.

→ లారీలు రాక, మిల్లర్ల కటింగ్‌తో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇన్సురెన్స్ లేని ధాన్యం తరలించే లారీ ఢీకొని ఇటీవల ఒక వ్యక్తి మృతిచెందాడని, అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీ తిరుపతి రెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

→ జిల్లాలో గుండెపోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో వెంటనే డయోగ్నస్టిక్స్ ఏర్పాటు చేసి, సేవలు అందుబాటులోకి తీసుకరావాలని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందటంలేదని, సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

కొనుగోలులో వేగం పెంచాలి



అకాలవర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేల చొప్పున మొదటి విడత జిల్లాలోని 5,790 మంది రైతులకు 6910.02 ఎకరాలకుగాను రూ.6.91లక్షలు మంజూరు చేస్తాం. రెండో విడత 17,560 మంది రైతులకు చెందిన 21,948 ఎకరాలకు పంట నష్ట పరిహారానికి ప్రతిపాదనలు పంపించాం. డయాగ్నస్టిక్ హబ్ ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల వైద్యులు సకాలంలో విధులకు హాజరయ్యేలా పటిష్ట చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగనీయొద్దు. – పుట్ట మధుకర్, జెడ్పీ చైర్మన్

బయోమెట్రిక్ ద్వారా పర్యవేక్షించాలి



పీహెచ్‌సీల్లో వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా బయోమెట్రిక్ ద్వారా అటెండెన్స్ ప్రతిరోజూ పర్యవేక్షించాలి. జిల్లాలో ఇకనుంచి ప్రతిరోజు పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా పటిష్ట చర్యలు చేపట్టాలి. జూన్ మొదటి వారం నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 3.5 లక్షల టన్నులు కొనుగోలు చేయాల్సిందే. ధాన్యం సరఫరా సమయంలో లారీల కొరత రాకుండా అవసరమైతే అదనపు లారీల ఏర్పాటుకు కాంట్రాక్టర్‌తో చర్చించండి. రైస్ మిల్లుల వద్ద లారీ లోడ్ దించుకోకుండా పెండింగ్లో ఉంటే డిప్యూటీ తహసీల్దార్లు, పౌర సరఫరా అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి. – సంగీత, కలెక్టర్

మట్టిదందాపై విచారణ చేపట్టాలి



రాఘవపూర్, కొత్తపల్లిలో జోరుగా మట్టి దందా కొనసాగుతోంది. అనుమతులకు విరుద్ధంగా వేబిల్లులు లేకుండా, ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా రోడ్లు డ్యామేజ్ అవటంతో పాటు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్డీవో, రెవెన్యూ, సంబంధింత అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. ఇసుక, మట్టి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అధికారులు చెప్పుతున్నారు.. కానీ ప్రభావిత గ్రామాల్లో ఆ ఆదాయం ఎందుకు ఖర్చు చేయటంలేదో ప్రజలకు చెప్పాలి. – గంటా రాములు, ఓదెల జెడ్పీటీసీ

కంటి ఆపరేషన్లు చేయాలి



ప్రభుత్వం కంటివెలుగు ద్వారా అద్దాలు పంపిణీ చేస్తోంది. దాంతోపాటు కంటి పరీక్షలు అవసరమైన వారికి వెంటనే శిబిరాలు ఏర్పాటు చేసి శస్త్రచికిత్సలు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరేలా అధికారులు అవగాహన కల్పించాలి. మోడల్ స్కూల్ విద్యార్థులకు రవాణా కోసం వాహనాలు కల్పించాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయులను కొరతను తీర్చేలా తాత్కాలికంగా విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేయాలి. – బొద్దుల లక్ష్మీనర్సయ్య, జూలపల్లి జెడ్పీటీసీ

నేటినుంచి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

- చెత్త సేకరణకు ఇంటింటికీ రూ.40 వసూలు చేయండి
- పాత వస్తువుల రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించాలి
- అధికారులను ఆదేశించిన నగర మేయర్ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న నగర మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం నుంచి ఎనిమిది రోజులపాటు నగరంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని మేయర్ బంగి అనిల్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావుతో కలిసి శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ‘మేరిలైఫ్.. మేరా స్వచ్ఛ షహర్’ప్రచార కార్యక్రమం, శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం వరకు కార్యక్రమాలు ఉండాలన్నారు. రీడ్యూస్, రీయూజ్, రీసైకిల్ కేంద్రాలను వార్డుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాత వస్తువులు, పుస్తకాలు, పాదరక్షలను ఈ కేంద్రాల్లో అప్పగించాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ జరగాలని, చెత్తను బయట పడేసేవారికి జరిమానా విధించాలని ఆదేశించారు. ముందుగా మేయర్ తన చాంబర్‌లో పారిశుధ్యంపై సిబ్బందితో సమీక్షించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, చెత్త సేకరణకు ప్రతి ఇంటి నుంచి రూ.40 వసూలు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, ఆర్‌ఓ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందిపెడితే మిల్లర్లపై చర్యలు



రాగినేడులో సమస్యలపై ఆరా తీస్తున్న కలెక్టర్ సంగీత

- ధాన్యం తూకంలో కోతలు వద్దు
- పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలి
- రాగినేడులో పర్యటించిన కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ‘పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కష్టాలు పడాల్సి వస్తోంది.. నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు పడుతున్నం. బస్తాకు రెండు, మూడు కిలోలు కోత పెడుతున్నరు. సరే అనుకుంటే మిల్లుకు వెళ్లిన లారీని దించుకోకుండా అక్కడ మరో కిలోచొప్పున కోత పెడుతున్నారు..’ అని కలెక్టర్ సంగీత ఎదుట పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామ రైతులు యాదగిరి బుచ్చమ్మ, నర్సింగం, నేరేళ్ల లక్ష్మి, గుండ సత్తయ్య రాజమల్లయ్య తదితర రైతులు వాపోయారు. కలెక్టర్ సంగీత గురువారం పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. పలు కాలనీలను కలియతిరిగారు. ప్రజలతో పలు సమస్యలపై ఆరా తీశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన ఆవేదనను తెలుసుకుని ఇబ్బందుల్లేకుండా చూస్తానంటూ హామీ ఇచ్చిన కలెక్టర్.. అప్పటికప్పుడే జిల్లా సహకార శాఖ అధికారి మైఖేల్‌బోస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల వద్ద జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

రోజు చెత్త తీసుకెళ్తున్నారా..?

ఇంటింటికీ పంచాయతీ సిబ్బంది వచ్చి ప్రతిరోజూ చెత్త తీసుకెళ్తున్నారా..? అని కలెక్టర్ మహిళలను అడిగి తెలుసుకున్నారు. రెండురోజులకోసారి వస్తున్నారని మహిళలు తెలిపారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని, మరుగుదొడ్లను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంకుడుగుంతలను పరిశీలించారు. ఇంటి ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో పండ్లు, పూలు, కూరగాయల మొక్కలను పెంచుకోవాలని సూచించారు. రేషన్‌డీలరు సరుకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలి

పారిశుధ్యం మరింత మెరుగుపర్చాలని, ప్రజలకు తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేలా అవగాహన పెంచాలని ఎంపీడీఓ రాజు, ఎంపీఓ సుదర్శన్‌కు సూచించారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. డంపింగ్‌యార్డు నిర్వహణ, వర్మీకంపోస్టు తయారీ తదితర విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచి రాగినేడును ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు.

ఆహార పదార్థాల సరఫరాకు టెండర్లు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సాంఘికసంక్షేమ గురుకుల విద్యాలయాలు, కాలేజీలకు ఆహారపదార్థాలను సరఫరా చేసేందుకు టెండర్లను ఈనెల 30లోగా సమర్పించాలని అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ కోరారు. వచ్చే విద్యాసంవత్సరానికి జిల్లాలోని 6 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు (మల్లాపూర్, గర్రెపల్లి, రామగుండం, నందిమేడారం, మంథని, పెద్దపల్లికి) ఆహార పదార్థాలు కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్ కొనుగోలు నిమిత్తం ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు రూ.వెయ్యి డీడీ చెల్లించి టెండర్ దరఖాస్తు ఫారం రామగుండం గురుకుల పాఠశాల నుంచి పొందాలన్నారు.

రేపు లీగల్ లిటరసీ క్యాంపు ఏర్పాటు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో ఈనెల 20న లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ తెలిపారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారానికి చట్టప్రకారంగా సలహాలు పొందవచ్చని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో ‘సన్న’బువ్వ

- లబ్ధిదారుల్లో ఆనందం
- జిల్లాలో 706 కేంద్రాలు



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకుంటున్న చిన్నారులు

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లుగానే ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అమలుకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దొడ్డుబియ్యంతో వండిన అన్నం తినేందుకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆసక్తి చూపకపోవడంతో వారికి సన్న బియ్యం భోజనం అందించాలని భావించిన సీఎం కేసీఆర్ సదరు ఫైల్‌పై సంతకం చేసిన విషయం తెల్సిందే. ఈ విధానం ద్వారా జిల్లాలోని లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.

కేంద్రాల్లో ఇలా..

మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు రోజుకోగుడ్డు (ఉడకబెట్టింది), 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5గ్రాముల నూనెతో చేసిన ఆహారం, 20 గ్రాముల మురుకులు (కుర్‌కురేలు), 50 గ్రాముల బాలామృతం అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు వారికి నెలకు 16 గుడ్లు అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మీ పథకం కింద రోజుకు 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల మంచినూనెతో చేసిన ఆహారం, 200మిలీలీటర్ల పాలు అందిస్తున్నారు. మిగతా పోషకాహారం బాగానే ఉన్నా.. దొడ్డుబియ్యంతో భోజనం వడ్డిస్తుండటంతో తినేందుకు కొందరు ఆసక్తి చూపడం లేదు. సన్నబియ్యంతో కూడిన భోజనమైతే ఇష్టంగా తినే అవకాశం ఉంటుందని లబ్ధిదారులు అంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఒక్కో కేంద్రానికి సగటున 60 నుంచి 80 కిలోల చొప్పున సన్న బియ్యం సరఫరా కానున్నాయి. జిల్లాలో గర్భిణులు 4,322 మంది, బాలింతలు 4,481 మంది ఉన్నారు. ఏడాది నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 18,897 మంది, ఆరేళ్లలోపు 8,891 మంది వరకు ఉన్నారు. వీరందరికీ ప్రతిరోజూ ఆహారం, గుడ్లతోపాటు పాలు సరఫరా చేయనుండటంతో పూర్తిస్థాయిలో పోషకాహారం అందనుందని భావిస్తున్నారు.

ప్రాంతం	గర్భిణులు	బాలింతలు	ఏడాదిలోపు	మూడేళ్లలోపు	ఆరేళ్లలోపు
రామగుండం	1367	1442	1285	5203	2454
మంథని	816	883	740	3006	1924
పెద్దపల్లి	2139	2156	1762	6901	4513

నిర్ణయం మంచిదే



బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సన్నబియ్యంతో కూడిన భోజనం అందించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. బాలింతలకు మరింత పౌష్టికాహారం ముందే అవకాశం ఉంది. ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. – అనీషాబేగం, గర్భిణి, సుల్తానాబాద్

ఆదేశాలు రాగానే..



సన్నబియ్యంతో భోజనం పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇంకా ఆదేశాలు రావాల్సి ఉంది. రాగానే లబ్ధిదారులకు సన్న బియ్యంతో భోజనం వడ్డిస్తాం. దీనిద్వారా లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. రవుఫ్‌ఖాన్, డీడబ్ల్యూఓ

పల్లెల్లో పారిశుధ్యంపై ఆరా

- మండలంలో పర్యటించిన గ్రామీణాభివృద్ధి జాయింట్ డైరెక్టర్
- వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి అని సూచన



సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న శ్రీనివాస్

ఎలిగేడు: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని ధూళికట్ట, లాలపల్లి ఎలిగేడు, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో కొనసాగుతున్న పనులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్ ఆరేపల్లి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ఇళ్ల వివరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. జీపీ ప్రొఫైల్ ద్వారా వివరాలు సరిచూసుకున్నారు. సెప్టిక్ ట్యాంకు గల ఇళ్లకు తప్పనిసరిగా ఇంకుడుగుంత ఉండాలని, కొత్త ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్ల ప్రతిపాదనలు పంపి మంజూరు చేయించాలని తెలిపారు. జీపీ పరిధిలోని శ్మశాన వాటిక, కంపోస్టుషెడ్లను పరిశీలించారు. పొడి చెత్తను ఏ ఏజెన్సీ ద్వారా అమ్ముతున్నారో అడిగి తెలుసుకున్నారు. నర్సరీలను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్ రెడ్డి, ఏపీవో సదానందం, సర్పంచులు భూర్ల సింధూజ, సింగిరెడ్డి ఎల్లవ్వ, గొల్లె కావేరి, అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు, టీఏ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలాల్లో గడ్డికి నిప్పు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కమాన్‌పూర్(మంథని): మండలకేంద్రంలోని దాసరిపల్లె శివారులో పంట పొలాల్లో గడ్డికి నిప్పు అంటుకుంది. ఒక్కసారి మంటలు వ్యాప్తి చెందడంతో ప్రజలు ఆందోళన చెందారు. మంటలు వ్యాప్తి చెంది సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి చేరువుగా వస్తుండడంతో స్థానికులు, రైతులు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాకపోవడంతో పెద్దపల్లి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైరింజన్‌తో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. రైతులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘన స్థలానికి తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఆర్ఐ సంధాని, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెళ్లి, పరిశీలించారు.

శ్మశానవాటికలో అర్ధరాత్రి క్షుద్రపూజలు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మోతె శ్మశానవాటికలో ఓ వ్యక్తి నగ్నంగా క్షుద్రపూజలు చేయడం జిల్లాలో కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి శ్మశానవాటికలోని బూడిదను శరీరంపై చల్లుకొని, హరహర మహాదేవ శంభోశంకర అంటూ అరిచాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు భయపడుతున్నారు. అసలు పూజలు చేసిన వ్యక్తి ఎవరు, నగ్నంగా ఎందుకు చేశాడనే విషయం అంతుపట్టడం లేదని అంటున్నారు.

గుండెపోటుతో విలేకరి మృతి

ఓదెల(పెద్దపల్లి): మండల కేంద్రంగా ఓ దిన పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న కొలనూర్ గ్రామానికి చెందిన సామ లింగమూర్తి(45) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఓదెల జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములుయాదవ్, కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, జర్నలిస్టు సంఘం ప్రతినిదులు తాడూరి కరుణాకర్, విజయసింహారావు, బుర్ర సంపత్‌గౌడ్, కట్ట నరేంద్రచారి పరామర్శించారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు

జ్యోతినగర్(రామగుండం): దాడి ఘటనలో ఇరువర్గాలపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. మల్కాపూర్ శివారులోని ఫిల్టర్‌బెడ్ వద్ద గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఎంబడి రమేశ్ బుధవారం తన మిత్రులతో కలిసి గోదావరి నదిలో తెప్పను బయటకు తీసుకువచ్చాడు. అన్నపూర్ణకాలనీకి చెందిన రవీందర్, దామెరకుంట శివలు తెప్పను వదిలిపెట్టాలని అనడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో పరస్పరం దాడి చేసుకున్నారు. రమేశ్ తనపై రవీందర్, శివలు దాడి చేశారని, శివ తనపై రమేశ్ అతని మిత్రులు దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసుకొని, విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐటీఐల్లో ప్రవేశానికి జూన్ 10 వరకు గడువు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నర్సింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన ప్రతీ విద్యార్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ ఐటీఐల్లో ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు.

రైల్వే ట్రాక్ భగ భగ

- ఉదయం 10 గంటలకే 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 65 డిగ్రీలకు చేరితే పట్టాలు సాగిపోయే అవకాశం
- రామగుండంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పని చేస్తున్న కార్మికులు



రైల్వే ట్రాక్‌పై ఎండలో పని చేస్తున్న కార్మికులు

రామగుండం: పైన మండే సూర్యుడు.. కింద నిప్పు కణికల్లాంటి కంకర రాళ్లు.. గడ్డపార, పంజా చేతపట్టి కంకర వేరు చేయాలి.. ఎండ తీవ్రతకు ఆరోగ్యం సహకరించకపోయినా కుటుంబపోషణకు కష్టపడుతున్నారు ఆ కార్మికులు. సాధారణ ఉష్ణోగ్రతల కంటే పది డిగ్రీలు అదనంగా ఉండే రామగుండం మెయిన్ రైల్వే ట్రాక్‌పై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, నిర్వహణ పనులు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే అధికారి కార్మికుల పని ప్రదేశంలో ఐదు నిమిషాలు నిలిచి ఉండలేని పరిస్థితుల్లో 8 గంటలు కష్టపడుతున్నారు. తమ కష్టాన్ని గుర్తించాలని కోరుతున్నారు. రైల్వే ట్రాక్‌పై ఉదయం పది గంటలకే థర్మామీటర్‌లో 50 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డవుతోంది.

ఇప్పటివరకు గరిష్టంగా 59 డిగ్రీలు నమోదు

ఏటా మే మాసంలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రైల్వే ట్రాక్‌పై 65 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే పట్టాలు సాగిపోయి, మెలితిరిగే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఉష్ణోగ్రత 60 డిగ్రీలకు చేరిందంటే రైల్వే ట్రాక్‌పై ప్రత్యేక పర్యవేక్షణ, నిఘా ఏర్పాటు చేస్తారు. కాగా, ఈ నెలలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. మే 1న మధ్యాహ్నం ఒంటి గంటకు 48 డిగ్రీలు, 8న మధ్యాహ్నం 54, 9న మధ్యాహ్నం 59, 12న మధ్యాహ్నం 59 డిగ్రీలు నమోదయ్యాయి.

అదనంగా డబ్బులు చెల్లించాలి



నేను పెద్దగా చదువుకోక పోవడంతో వైట్‌కాలర్ జాబ్స్ చేసే అర్హత కోల్పోయాను. చేసేది లేక కుటుంబపోషణకు రైల్వే ట్రాక్ పనులు చేస్తున్నాను. ప్రతీరోజు రూ.550 వేతనం చెల్లిస్తారు. వేసవి విపత్కర పరిస్థితుల్లో అదనంగా డబ్బులు చెల్లిస్తే సంతోషిస్తాం.

– కావటి నదయ్య, కార్మికుడు, కుందనపల్లి

ప్రాణాలకు భద్రత లేదు



మా ప్రాణాలకు ఎలాంటి భద్రత లేకపోవడం బాధాకరం. ఎండ దెబ్బ తగిలినా, అస్వస్థతకు గురైనా, ప్రమాదవశాత్తు రైలు ప్రమాదం జరిగినా రైల్వే శాఖకు, కాంట్రాక్టర్‌కు బాధ్యత ఉండదు. పని చేశామా.. ఆ రోజుకు వేతనం చెల్లించారా అంతే సంగతి.

– కట్ల కుమార్, కార్మికుడు, బద్రిపల్లి

కుటుంబం కోసం తప్పదు



ఏ శాఖలో ఎక్కడికి పనికి వెళ్లినా కార్మికుల భద్రత చూసే కాంట్రాక్టర్లు కానరారు. నిత్యం పని దొరుకుతుందన్న గ్యారెంటీ ఉంది. కుటుంబం కోసం చేయక తప్పదు. అసంఘటిత రంగంలో విధులు నిర్వహిస్తున్నాం కాబట్టి మెరుగైన వేతనం ఇవ్వాలి.

– కోడిపుంజుల భూమయ్య, కార్మికుడు, పెద్దపల్లి

పెండింగ్ కేసులకు పరిష్కారం చూపాలి

- కమిషనరేట్ వర్టికల్ ఇన్‌చార్జి, జైపూర్ ఏసీపీ నరేందర్



మాట్లాడుతున్న ఏసీపీ నరేందర్, చిత్రంలో సీఐలు రాజు, వాసుదేవరావు, విద్యాసాగర్, బాబురావు

గోదావరిఖని(రామగుండం): నేరస్తులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని రామగుండం పోలీస్ కమిషనరేట్ వర్టికల్ ఇన్‌చార్జి, జైపూర్ ఏసీపీ నరేందర్ అన్నారు. గురువారం కమిషనరేట్ మీటింగ్ హాల్‌లో కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు చెందిన టెక్ టీం వర్టికల్ ఆఫీసర్లు, సైబర్ వారియర్స్, హెచ్ఆర్ఎంఎస్ వర్టికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో పనితీరు మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, సైబర్‌క్రైం పిటిషన్లపై నిర్వహణ వ్యవస్థలో పనితీరు, పెండింగ్ సైబర్ క్రైం కేసులకు పరిష్కారం చూపడం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. సాంకేతిక సమస్యలను తొలి దశలోనే గుర్తించి, పరిష్కరిస్తూ స్టేషన్‌కి సంబంధించిన నేర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సైబర్ సెక్యూరిటీలో భాగంగా సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ క్రైంలో డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు కోర్టు ద్వారా తిరిగి ఇప్పించవచ్చని చెప్పారు. అలాగే మోసం చేసిన వారి ఖాతాను హోల్డ్ చేయవచ్చన్నారు. ఇతర రాష్ట్రాల జైళ్లలో ఉన్న మన కేసులకు సంబంధించిన నిందితులను తెలంగాణ సైబర్ క్రైం బ్యూరో సమన్వయంతో పీటీ వారెంట్‌పై అరెస్టు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు బి.రాజు, వాసుదేవరావు, విద్యాసాగర్, బాబురావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ల డిమాండ్లు నెరవేర్చండి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజన్న



మాట్లాడుతున్న రాజన్న

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ప్రాంతంలో ట్రాక్టర్ డ్రైవర్లు చేస్తున్న సమ్మె న్యాయమైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీజిల్, పెట్రోల్, నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచడంతో సామాన్య ప్రజలు జీవించడం కష్టంగా మారిందన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో డ్రైవర్లు వారి కుటుంబాలను పోషించుకోలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ యజమానులు డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ట్రాక్టర్ డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని పేర్కొన్నారు. నాయకులు ఈదునూరి నరేశ్, వెంకన్న, చిలుక శంకర్, అశోక్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి, డివిజన్ నాయకులు బుచ్చయ్య, కొమురయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



కాల్వశ్రీరాంపూర్: గంగారం పంచాయతీ పరిధి ఊశన్నపల్లెలో ఆటోలో గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గ్రామస్తులు పట్టుకున్నారు. సుమారు 5 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సంబంధిత అధికారులకు సమాచారమిచ్చారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



మల్యాల(చొప్పదండి): ఉపాధి కోసం గల్ఫ్‌బాట పట్టిన వలసజీవి అనారోగ్యంతో చికిత్స పొందుతూ దుబాయ్‌లో మృతిచెందగా మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తుల వివరాలు.. మండలంలోని ముత్యంపేటకు చెందిన లింగాల ముత్తయ్య (55) ఇరవై ఏళ్లుగా ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. దుబాయ్‌లోని ఆల్ జబర్ ఎనర్జీ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ కంపెనీలో గార్డెన్ వర్క్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. 15 రోజుల క్రితం విధులకు వెళ్లి, తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆస్పత్రిలో చేరాడు. చికిత్స కోసం డబ్బులు లేకపోవడంతో స్థానిక పీసీసీ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ చాంద్‌పాషా అక్కడి భారత రాయబార కార్యాలయంతో సంప్రదించి చికిత్స అందించేందుకు కృషి చేశారు. కాగా ముత్తయ్య ఈ నెల 14న మృతిచెందగా, అక్కడి కంపెనీ యాజమాన్యం సహకారంతో మృతదేహాన్ని చాంద్‌పాషా స్వగ్రామానికి చేర్చారు. ఉపాధి కోసం వెళ్లి, శవపేటికలో వచ్చిన ముత్తయ్య మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన దంపతులు

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): బైక్‌ను ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన ఉందాటి నాగయ్య బుధవారం పని నిమిత్తం తన భార్య సారవ్వతో కలిసి బైక్‌పై కదంబాపూర్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తుండగా మేకల లోడ్‌తో కనుకుల వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

లైట్ వెహికిల్స్ నిర్వహణపై పట్టింపేది?

- ఓసీపీ–3లో బ్యాటరీ పేలి, కాలిపోయిన డీజిల్ బోజర్
- వాహనాలకు ప్రత్యేక సెక్షన్ ఏర్పాటుకు కార్మికుల డిమాండ్



బుధవారం జరిగిన ప్రమాదంలో కాలిపోయిన డీజిల్ బోజర్ ముందు భాగం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3లో డీజిల్ బోజర్లు 9, ఎస్కార్ట్‌లు 30, ఎల్జీ వ్యాన్లు 6 మొత్తం 45 లైట్ వెహికిల్స్ ఉన్నాయి. కానీ వాటి నిర్వహణపై పట్టింపు లేకుండా పోయింది. ఈ వాహనాల కోసం ప్రత్యేకంగా సెక్షన్ ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నాయకులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. సేఫ్టీ కమిటీ సమావేశంలోనూ ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో బుధవారం డీజిల్ బోజర్ బ్యాటరీ పేలింది. ముందున్న క్యాబిన్, టైర్లు పూర్తిగా కాలిపోయాయి. క్వారీలో తిరిగే డంపర్లు, డోజర్లు, షావల్స్‌కు డీజిల్ నింపే ఈ బోజర్ వాహనాల నిర్వహణ లోపం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపిస్తున్నారు.

సింగరేణిలోనే అతి పెద్దది.. ఓసీపీ–3

పక్కనున్న ఓసీపీల్లో చిన్న వాహనాలకు ప్రత్యేక సెక్షన్ ఉన్నప్పటికీ సింగరేణిలోనే అతిపెద్ద ఓసీపీ–3లో మాత్రం ఏర్పాటు చేయడం లేదని అంటున్నారు. అదృష్టవశాత్తు బోజర్ టైర్లు, ముందు క్యాబిన్ కాలి, ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, అదే డీజిల్‌తో ఉన్న ట్యాంకర్‌కు నిప్పంటుకుంటే ఎంత పెద్ద ప్రమాదం జరిగేదోనని భయాందోళన చెందుతున్నారు. గత సేఫ్టీ కమిటీలో డీజిల్ బోజర్ల లీకేజీలు, నిర్వహణ సరిగా లేదని యాజమాన్యానికి నివేదిక అందించారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే డీజిల్ బోజర్ అగ్ని ప్రమాదానికి గురై, రూ.9 లక్షల మేర నష్టం జరిగిందని అంటున్నారు. ఇప్పటికైనా లైట్ వెహికిల్స్ నిర్వహణ కోసం ప్రత్యేక సెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫ్రీవేగన్ పనులు వేగవంతం చేయాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): జీడీకే–5 ఓసీపీ సీహెచ్‌పీలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్రీవేగన్ పనులు వేగవంతం చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం జీడీకే–5 ఓసీపీని సందర్శించి, పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్షణతో కూడిన ఉత్పత్తికి సహకరించాలన్నారు. అండర్ గ్రౌండ్ గ్యాలరీల్లో పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గని క్వారీ పని ప్రదేశాలు, కోల్‌బెంచ్‌లు, ఫైర్ ఫైటింగ్ విధానం తదితర అంశాలపై చర్చించారు. పరిసర ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా ఎప్పటికప్పుడు నీళ్లు చల్లించాలని చెప్పారు. ఆయన వెంట ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, క్వాలిటీ డీజీఎం శ్రీధర్, డీజీఎం రామస్వామి, మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ అధికారి శ్రీనివాస్, సర్వే అధికారి అశోక్ ఉన్నారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ తీరుతో సింగరేణి పరిస్థితి ఆర్థికంగా ఇబ్బందికరంగా మారిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో టీబీజీకేఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో సింగరేణిలో జరిగే ఎన్నికల్లో బీఎంఎస్‌ను ఆదరించాలని కోరారు. బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందం కోసం తమ సంఘం కృషి చేస్తుందన్నారు. సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరిణ్, సతీశ్, గట్టయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీల్లో షిఫ్టు వేళలు మార్చాలి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ఓసీపీల్లో షిఫ్టు వేళలు మార్చాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. గురువారం ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జీడీకే–5 ఓసీపీలో నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైవేటు షావల్, డోజర్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కచ్చకాయల సదానందం, టైసన్ శ్రీను, పోతరబోయిన సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కుక్కపిల్లలకు బారసాల

జగిత్యాలరూరల్: పెంపుడు కుక్క పిల్లలకు ఓ యజమాని బారసాల ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడలో పోతు గంగుకు చెందిన పెంపుడు కుక్క గత ఏప్రిల్ 28న 10 పిల్లలకు జన్మనిచ్చింది. గురువారం 21 రోజులు కావడంతో వాటికి కొత్త దుస్తులు తొడిగి, నామకరణం చేశారు. బంధువులకు విందు భోజనం పెట్టారు.



పోలీస్‌స్టేషన్‌లో వేసిన సీసీరోడ్డు



చిల్డ్రన్స్ పార్క్



పోలీస్‌స్టేషన్

పొత్కపల్లి ఠాణాకు ఉద్యానవన రూపు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ రూపురేఖలను మార్చేశారు ఎస్సై మహేందర్. ఠాణాకు సుందరమైన ఉద్యానవనంగా తీర్చిదిద్దారు. సిబ్బంది, ఫిర్యాదుదారుల పిల్లలు కాసేపు ఆడుకునేలా చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేశారు. వర్షాలకు బురదమయం కాకుండా ఉండేందుకు సీసీరోడ్లు, ఫిర్యాదుదారులు కూర్చునేలా గద్దెలు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. పోలీస్ సిబ్బందితోపాటు ఫిర్యాదు చేసేందుకు వచ్చేవారు తమ వాహనాలు నిలుపుకునేందుకు బైక్ స్టాండ్ ఏర్పాటు చేయించారు. మహిళల కోసం రిసెప్షన్ కౌంటర్, ఇతర సౌకర్యాలు కల్పించారు. సిబ్బంది, చుట్టుపక్కల గ్రామాల వారు సాయంత్రం ఆడుకునేలా షటిల్ కోర్టులు ఏర్పాటు చేయించారు. వందశాతం ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.